రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- ముక్కోలులో ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

కిర్లంపూడి: రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని ముక్కొలులో మేడిబోయిన నాగార్జున అధ్యక్షతన వైఎస్సార్ సీపీ నాయకులతో సోమవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ 2019లోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసేందుకు పేద, బడుగు, బలహీన వర్గాలు ప్రజలు భారీగా ఓట్లు వేశారన్నారు. గత నాలుగున్నరేళ్లలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. నిత్యం ప్రజా శ్రేయస్సు కోసమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై మరోసారి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం ప్రజల సొంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, పార్టీ నాయకులు తోట నరేంద్ర, తోట బాబ్జీ, తోట ఆదినారాయణ, సాగిరాజు రామకృష్ణరాజు, మేడిబోయిన విశ్వనాథం, పెనగంటి రాజేష్, తోట అయ్యన్న, ఓలేటి రాజు, బేరి బాబ్జి, అడబాల సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వరుపుల'ను కలసిన తహసీల్దార్ రంగారావు



లింగంపర్తిలో వరుపులను కలసిన తహసీల్దార్ రంగారావు

ఏలేశ్వరం: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వై.రంగారావు సోమవారం లింగంపర్తిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న భూహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేత వరుపుల సూరిబాబు, వీఆర్వో అవసరాల కిషోర్ పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో సూర్యనారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేశ్

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లు గ్రామానికి చెందిన అల్లుమల్ల సూర్యనారాయణ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో సోమవారం గ్రామ వలంటీర్ ఆకేటి వెంకటేశ్ సొంత ఖర్చులతో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి సూర్యనారాయణకు పింఛన్ అందజేశాడు. సేవాభావం చాటిన వలంటీర్ వెంకటేశ్‌ను పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పూజిత మృతికి సంతాపం

కోటనందూరు: ఈ నెల 1న మృతి చెందిన బాపట్ల జిల్లా వేమూరి మండలం చావలి ఆర్బీకే వీఏఏ బెల్లంకొండ పూజితకు మండల వీఏఏలు, వీహెచ్ఏలు సంతాపం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో సహ ఉద్యోగులంతా ధైర్యంగా పని చేయాలని, సమస్యలు ఎదురైనప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

మండలాభివృద్ధికి కృషి చేస్తా

గోకవరం: మండలంలోని ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎంపీడీఓ వసంత అన్నారు. ఇటీవల ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన ఆమె సోమవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన

తుని: ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించే డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకోవాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని తుని ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో సోమవారం డీఎం కె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంవీఐ శ్రీనివాస్ వివరించారు. డ్రైవర్లకు అవసరమైన శిక్షణ, ప్రయాణ సమయంలో ఇతర వాహనాలను గుర్తించి, మంచి అవగాహనతో నడిపేలా చర్యలు తీసుకుంటున్నామని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ తెలిపారు. జీరో ప్రమాదాలు కలిగిన డ్రైవర్ కె.చంటికి అవార్డు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ జి.రమణ, డ్రైవర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం



రౌతులపూడి సీహెచ్‌సీలో భవనాల శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

రౌతులపూడి: మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సోమవారం శ్రీకారం చుట్టారు. ఎస్.పైడిపాల, ములగపూడి, గిడిజాం, రౌతులపూడి గ్రామాల్లో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ములగపూడి, గిడజాం, రౌతులపూడిలో రూ.20.80 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్లు, ములగపూడిలో రూ.45 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాలను ప్రారంభించారు. రౌతులపూడిలో రూ.1.08 కోట్ల మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.10 లక్షలతో నిర్మించిన డిజిటల్ తరగతి గది భవనాన్ని ప్రారంభించారు. రౌతులపూడిలో సీహెచ్‌సీలో నాబార్డు నిధులు రూ.6.99 కోట్లతో భవన సముదాయాలను ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, సర్పంచులు జిగిరెడ్డి నారాయణమ్మ, తమరాన సత్యనారాయణ, కటారి అజ్జమ్మ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రాయి ప్రసాద్, సీహెచ్‌సీ వైద్యాధికారి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో మెరుగైన సేవలు

శంఖవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి, గౌరంపేట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, కొంతంగిలో హెల్త్ క్లినిక్ భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులతో వారికి అవసరమైన సూచనలు, సలహాలను అధికారులు ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రామిశెట్టి ఏసుబాబు, దూడల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



పోలింగ్ కేంద్రాల లిస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి తెలిపారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్టు చెప్పారు. గ్రామ పెద్దలు, సంబంధిత పార్టీల కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇచారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్. రామకృష్ణ పాల్గొన్నారు.

హిందూ సంప్రదాయాలపై ప్రచారం

తుని రూరల్: మండలంలోని రాజుపేటలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వమించారు. యోగి వేమన జయంతిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

టెండర్లు రద్దు చేయాలి

కాకినాడ సిటీ: పౌరసరఫరాల సంస్థ నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసరాలు సరఫరా చేసేందుకు బినామీ పేరుతో టెండర్లు దాఖలు చేసిన బొర్రా వెంకటరత్నంపై చర్యలు తీసుకోవాలని పెద్దాపురం మండలం దివిలికి చెందిన కె.శ్రీరామచంద్రమూర్తి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు సోమవారం ఫిర్యాదు చేశారు. జగ్గంపేట మండలం చంద్రమాంపల్లికి చెందిన బొర్రా వెంకటరత్నం తన భార్య పేరుతో రేషన్ షాపు నడిపేవాడని, అప్పట్లో రేషన్ షాపును అధికారులు తనిఖీ చేయగా 110 బస్తాలు తక్కువ ఉండడం గుర్తించి డీలర్‌షిప్‌ను రద్దు చేశారన్నారు. తిరిగి వెంకటరత్నం దివిలికి చెందిన అడ్డూరి సత్యనారాయణ పేరుతో స్టేజ్-2 కాంట్రాక్టర్‌గా ఉంటూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం, నిత్యావసరాలు సరఫరా చేసేవాడన్నారు. దీనిద్వారా అతను అనేక అవకతవకలకు పాల్పడడంతో అధికారులు కేసులు నమోదు చేసి తొలగించారన్నారు. ఇప్పుడు మళ్లీ వెంకటరత్నం స్టేజ్-2 కాంట్రాక్టర్‌గా పుప్పాల కృపానందం పేరుతో దివిలి ఎంఎల్ఎస్ పాయింట్‌కు టెండర్ వేశాడన్నారు. అక్రమ మార్గంలో టెండరు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యాయవాదుల రిలే దీక్షలు

ప్రత్తిపాడు: ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన భూహక్కు చట్టం-2023ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులు రిలే దీక్షలు చేపట్టారు. మధ్యాహ్నం వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. దీక్ష శిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ సందర్శించి మద్దతు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ పుల్లయ్య, బొంగుకూరి మధుబాబు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ పాల్గొన్నారు.

పేదల భూములకు పట్టాలివ్వాలంటూ ఆందోళన



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగారాజు

ప్రత్తిపాడు: పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయార్లా) ఆధ్వర్యంలో సోమవారం ప్రత్తిపాడులో ఆందోళన చేశారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్, అంబేడ్కర్ కళా మందిర్, మెయిన్‌రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగత బంగారాజు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నాయన్నారు. అనేక సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములకు జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ, పోరంబోకు భూములకు పట్టాలివ్వాలని, జిరాయితీ భూమి పేదల సాగులో ఉంటే అనుభవదారులుగా గుర్తించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎస్.నరసింహరావుకు అందజేశారు. కార్యక్రమంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, ఆయర్లా జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, చింతలూరు ఈనాం భూముల సాధన కమిటీ కన్వీనర్ తాడి నాగేశ్వరరావు, లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు రాజాల రత్నం, చిన్నం సింహాచలం, తూము చెల్లబాబు, పిడుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు



లింగంపర్తిలో వరుపులను సత్కరించి సంఘీభావం తెలుపుతున్న మహిళలు



లింగంపర్తిలో అనంతబాబు, సుబ్బారావును గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా అందరికీ పథకాలు అందడంతో వైఎస్సార్ సీపీకి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్‌కు ప్రజాదరణ తగ్గలేదనడానికి ఏలూరు సిద్ధం బహిరంగ సభే సాక్ష్యమన్నారు. భవిషత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే సీఎం జగన్‌కు మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వరుపులను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావును కలిశారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతిసుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ నానిపల్లి చంటి, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

ప్రత్తిపాడు/గండేపల్లి: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో సోమవారం సాయంత్రం విద్యుత్ సిబ్బంది, రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట పొలాల్లో పగలు-రాత్రీ తేడా లేకుండా ఎవరూ లేని సమయాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను విడగొట్టి, దానిలో ఉండే కాపర్ తీగలను చోరీ చేస్తున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై రైతాంగం నిఘా ఉంచాలన్నారు. చోరీ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. దొంగల వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలను అరికట్టేందుకు సూచనలు, సలహాలు అందివ్వాలని ఎస్సై ఎం పవన్‌కుమార్ కోరారు. గండేపల్లిలో రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు చోరీపై ఎస్సై ఎస్.రామకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఏ ఎం రాజశేఖరం, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్లు వైవీ రమణ, రామకృష్ణ, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సత్తిరాజు



సత్తిరాజు

ప్రత్తిపాడు: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన అన్నవరం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు శింగిలిదేవి సత్తిరాజు ఎన్నికయ్యారు. ప్రత్తిపాడులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జిల్లా కిసాన్ మోర్చా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులుగా బాలిన వెంకటేశ్వరరావు (జగ్గంపేట), పడాల శ్రీను (గొల్లప్రోలు), తండపురెడ్డి మాణిక్యం (ప్రత్తిపాడు), సిద్దా వీరభద్రరావు (కాకినాడ రూరల్), తంగిడిపల్లి గనిరాజు (జగ్గంపేట), ప్రధాన కార్యదర్శులుగా బంగారు రమణబాబులు (తుని), జీలకర్ర సత్యనారాయణ (పిఠాపురం), కార్యదర్శులుగా పెంకె వెంకటరమణ (పెద్దాపురం), ఆచంట శ్రీనివాస్ (కాకినాడ రూరల్), పాలకుర్తి సూర్యనారాయణ (జగ్గంపేట), దేవర రామకృష్ణ యాదవ్ (ప్రత్తిపాడు), కోశాధికారిగా పల్లా ప్రసాద్ (తుని)లతో పాటు మరో 16 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్సూరెన్స్ సెల్ కో కన్వీనర్ పెండెం బాబ్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనుం నాగబాబు, కామినేని జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్మృతివనం సందర్శన



కేడీ పేట స్మృతివనంలో అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుని రూరల్: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు స్మృతి వనాన్ని సోమవారం డి.పోలవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సందర్శించారు. స్వతంత్ర్య సమరయోధుల చరిత్ర, ఉద్యమ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించడంలో భాగంగా హెచ్ఎం వాడపల్లి వెంకటరమణమ్మ (రాణి) ఆధ్వర్యంలో ఐదో తరగతి విద్యార్థులు కేడీ పేటలోని స్మృతి వనంలో అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులు, నర్సీపట్నంలోని సీతారామరాజు చేతిలో హతమైన బ్రిటీష్ అధికారులు హైటర్, కొవర్టుల సమాధులను సందర్శించారు. అల్లూరి త్యాగం ఫలితంగా ప్రస్తుతం మన్యం ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని హెచ్ఎం విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, బి.సారధ, పి.అప్పారావు, జి.రామ్‌కుమార్, ఎస్.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు, వృద్ధులకు సోమవారం బియ్యం పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో 30 మందికి 25 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగవల్లి నగర్‌లో 400 మంది నివసిస్తున్నారని, వీరిలో చాలా మందికి మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి

కోటనందూరు: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీఓ ఎస్.జయమాధవి ఆదేశించారు. మండలంలోని కోటనందూరు, కేఏ మల్లవరం, పాత కొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న ఇళ్ల రిజిస్ట్రేషన్లను సోమవారం ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్‌తో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. రిజిస్ట్రేషన్లలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలపై సిబ్బందితో చర్చించారు. 100 శాతం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయా సచివాలయల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్షించారు. మంగళవారం సాయంత్రానికి 100 శాతం కార్డుల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయలక్ష్మి, కుశిరెడ్డి అప్పలరాజు, రాజా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమావేశం

అన్నవరం: స్థానిక దేవస్థానం హైస్కూల్‌లోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కందర్ప భాస్కర శ్రీరామచంద్రమూర్తి సోమవారం తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై చర్చించామన్నారు. అసోసియేషన్ ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం తుని, ప్రత్తిపాడు సబ్‌ట్రెజరీ అధికారులు బాలసుందర్, సలీం ఖాన్‌లను సన్మానించారు. ద్విభాష్యం రమణమూర్తి, ఘంటశాల రామచంద్రరావు, నేమాల నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

తుని రూరల్: తుని మండలం తహసీల్దార్‌గా భరత్‌కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. దీనిలో భాగంగా ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన ఎల్.శివకుమార్ ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కృష్ణా జిల్లా నుంచి భరత్ కుమార్‌రెడ్డి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

కోటనందూరుకు ఇంతియాజ్ పాషా

కోటనందూరు: స్థానిక తహసీల్దార్‌గా షేక్ ఇంతియాజ్ పాషా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఇంతియాజ్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కోటనందూరు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పని చేసిన కె.కుశరాజు తుని డిప్యూటీ తహసీల్దార్‌గా వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా నరసింహారావు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్‌గా ఎస్.నరసింహారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన పీవీవీ గోపాలకృష్ణ ఏలూరు జిల్లా చింతలపూడికి బదిలీ అయ్యారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ నుంచి ఎస్.నరసింహరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్ నరసింహరావుకు డిప్యూటీ తహసీల్దార్లు టి.శ్రీనివాసరావు, కె.పుణ్యవతి, ఆర్.కల్యాణి, మండల సర్వేయర్ షేక్ బషీర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఘన స్వాగతం పలికారు.

జగ్గంపేట తహసీల్దార్‌గా సూర్యారావు

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్‌గా ఎం.సూర్యారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా జగ్గయ్యపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న సూర్యారావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బి.శ్రీదేవి పదోన్నతిపై కృష్ణాజిల్లాకు బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ సూర్యారావుకు పలువురు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి తహసీల్దార్‌గా చిరంజీవి

గండేపల్లి: స్థానిక తహసీల్దార్‌గా జె.చిరంజీవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి సీసీఎల్ఏ కార్యాలయంలో సూపరింటిండెంట్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ గండేపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన కేవీవీ సత్యనారాయణ కృష్ణాజిల్లా పామిడిముక్కల మండలానికి బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

శంఖవరం తహసీల్దార్‌గా రాజకుమారి

శంఖవరం: మండల తహసీల్దార్‌గా వి.రాజకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన అందిస్తానన్నారు.

తొండంగి తహసీల్దార్‌గా బాలకృష్ణారెడ్డి

తొండంగి: మండల తహసీల్దార్‌గా జి.బాలకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జి.బాలసుబ్రహ్మణ్యం గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నుంచి బాలకృష్ణారెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ ఎం.అఖిల, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గెట్టం వెంకటేశ్వరరావు, వీఆర్వోల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సత్తిబాబు, కార్యదర్శి కె.వి జయ సత్యమూర్తి, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.